




# కరపత్రం

SINCE 2014

సోమవారం జూన్ 22, 2026 సంపుటి : 2 సంచిక : 250 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


### ఒలింపిక్సే లక్ష్యంగా తెలంగాణలో

# 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'

- తెలంగాణలో త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ
- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడా విధానం
- గ్రామీణ ప్రతిభకు ప్రపంచ స్థాయి శిక్షణ
- టీజీ-20 క్రికెట్ లీగ్ ప్రారంభం
- ప్రతి జిల్లా నుంచి క్రీడాకారులకు అవకాశం
- క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబాటు
- ఉప్పల్‌లో అంతర్జాతీయ ప్రమాణాల యూనివర్సిటీ
- ఒలింపిక్ స్థాయి శిక్షణకు ఏర్పాట్లు
- 21 రోజుల పాటు టీజీ-20 హంగామా
- టోర్నీకి పూర్తి సహకారం: భట్టి విక్రమార్క



హైదరాబాద్:
గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవకాశాలు లేక మరుగున పడిపోతున్న ప్రతిభాపాటవాలను వెలికితీసి, వారికి సరైన శిక్షణనిచ్చి ప్రపంచానికి పరిచయం చేయడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో ఒలింపిక్స్ బరిలో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించేలా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సరికొత్త 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నాం" అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.
ఉప్పల్ స్టేడియం వేదికగా అత్యంత వైభవంగా ప్రారంభమైన 'టీజీ 20 క్రికెట్ లీగ్' మెగా టోర్నమెంట్‌కు డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తుకు ఈ లీగ్ ఒక బలమైన పునాది కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.
"గతంలో క్రికెట్ అంటే కేవలం నగరాలకే పరిమితమనే భావన ఉండేది. కానీ, ఆ పరిస్థితులను మారుస్తూ మొదటిసారిగా మా ప్రభుత్వం ప్రతి జిల్లా నుంచి క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించింది. జిల్లాల వారీగా జట్లను (టీమ్‌లను) ఎంపిక చేసి గ్రామీణ యువతకు ఈ మెగా వేదికను కల్పించాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం క్రీడలను పెద్దపీట వేస్తూ, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉంది" అని భట్టి విక్రమార్క తెలిపారు.
గతంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫుట్‌బాల్ స్టార్ 'మెస్సి' ఆడిన ఈ ఉప్పల్ స్టేడియం సాక్షిగా.. హైదరాబాద్ నగరంలో ప్రపంచ స్థాయి వసతులు, అన్ని హంగులతో కూడిన స్పోర్ట్స్ యూనివర్సిటీ రాబోతోందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఒలింపిక్స్ స్థాయి శిక్షణ ఇచ్చేలా తెలంగాణలో ఒక బలమైన క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.
మొత్తం 21 రోజుల పాటు సాగనున్న ఈ 'టీజీ 20 క్రికెట్' హంగామా.. రాష్ట్రంలోని క్రీడాభిమానులకు ఒక పెద్ద పండుగ వాతావరణాన్ని తీసుకురానుంది. ఈ టోర్నీ విజయవంతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# "బీజేపీ ఎన్నికల అధికారులతో కుమ్మక్కయ్యింది"

- నామినేషన్ తిరస్కరణపై ఆగ్రహం
- నత్వానీకి అవకాశం.. నాకు ఎందుకు లేదు?
- లీగల్ నోటీసు కేసు ఎలా అవుతుంది?
- కుట్రలో భాగంగానే నామినేషన్ రద్దు
- కాంగ్రెస్ గెలిచే సీటును అడ్డుకున్నారని విమర్శ
- బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆరోపణ
- ప్రజాస్వామ్యానికి ప్రమాదకర పరిణామమని వ్యాఖ్య
- తెలంగాణ నుంచి రాజ్యసభ సీటు వద్దన్న మీనాక్షి
- మధ్యప్రదేశ్ నుంచే అవకాశం కావాలని స్పష్టం




## తెలంగాణ రైతులకు IMD షాక్...

# ఆ రకం వరి సాగు చేయొద్దంటూ వార్నింగ్..



తెలంగాణ రైతాంగానికి షాక్ ఇచ్చింది IMD ఈ ఖరీఫ్ సీజన్ లో తెలంగాణ సోనా ( RNR 15048 ) రకాన్ని సాగు చేయొద్దని హెచ్చరించింది IMD. ఇప్పటిదాకా కురిసిన వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకొని జూన్ నెలలో RNR 15048 రకాన్ని సాగు చేయొద్దని హెచ్చరించింది. ఈ ఖరీఫ్ సీజన్ లో రైతులు ఏడు రకాల నాణ్యమైన వరి పండించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించగా వాటిలో ఈ రకాన్ని సాగు చేయొద్దని సూచించింది IMD.
RNR 15048 రకానికి బదులుగా రైతులు పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, మినుములు, ఆముదం వంటి వర్షాధార పంటలను సాగు చేయాలని పేర్కొంది వాతావరణ శాఖ.తేలికపాటి నేలల్లో ఒక వారంలో 50-60 మిల్లీమీటర్లు, బరువైన నేలల్లో 60-75 మిల్లీమీటర్ల మొత్తం వర్షపాతం నమోదైన తర్వాత, వర్షపు నీటి పైభాగంలోని 15 నుండి 20 సెంటీమీటర్ల మట్టి తడిసి, ఆ తడిగానే ఉన్నప్పుడు మాత్రమే వరి సాగు చేపట్టాలని ఐఎండి తెలిపింది.

### అట్టహాసంగా TG 20 లీగ్ ఓపెనింగ్ సెర్మనీ..

### హాజరైన భట్టి, సిరాజ్, రౌడీ బాయ్ విజయ్

హైదరాబాద్:
హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న TG 20 లీగ్ ఓపెనింగ్ సెర్మనీ అట్టహాసంగా జరిగింది. ఆదివారం (జూన్ 21) హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీమిండియా స్టార్ బౌలర్ మహ్మద్



సిరాజ్, మాజీ క్రికెట్ అంబటి రాయుడు, బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ మెంబర్ చాముండి, ఈ లీగ్ బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ హాజరయ్యారు.

### 'రాహుల్‌తో సమావేశం ఏర్పాటు చేయండి'

# రేవంత్‌కు రామచందర్‌రావు లేఖ

- గ్యారంటీల అమలుపై నిలదీత
- కాంగ్రెస్ హామీలు నెరవేరలేదని విమర్శ
- ప్రజల గోడు వినిపిస్తామన్న బీజేపీ
- రాహుల్ అపాయింట్‌మెంట్ కోరిన బీజేపీ
- మహిళలు, రైతులకు న్యాయం జరగలేదని ఆరోపణ
- హామీలపై సమాధానం చెప్పాలని డిమాండ్
- కాంగ్రెస్‌పై బీజేపీ విమర్శలు
- వెంటనే భేటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి





హైదరాబాద్:
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా.. ఆరు గ్యారంటీలు, హామీల అమలులో దారుణంగా విఫలమైందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ధ్వజమెత్తారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో నెరవేరని కాంగ్రెస్ గ్యారంటీలపై నిలదీసేందుకు, తెలంగాణ ప్రజల గోడు వినిపించేందుకు.. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో తమకు అత్యవసరంగా అపాయింట్‌మెంట్ ఇప్పించాలని లేఖలో పేర్కొన్నారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకత్వం ఈ అపాయింట్‌మెంట్ ఇప్పించడంలో విఫలమైతే.. అది తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ చేసిన మహా ద్రోహంగా నిర్ధరణ అవుతుందని విమర్శించారు.

### 6,303 మంది సైబర్ మోసం బాధితులకు

# రూ.45.21 కోట్లు రిఫండ్

- » ప్రత్యేక లోక్‌అదాలత్ ద్వారా డబ్బుల తిరిగి చెల్లింపు
- » సైబరాబాద్‌లో 2,232 మందికి రూ.21.91 కోట్లు రికవరీ
- » టీసీఎస్‌బీ పరిధిలో 77 మందికి రూ.6.83 కోట్లు తిరిగి చెల్లింపు
- » మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు అగ్రస్థానంలో
- » ఇప్పటివరకు 59,953 మందికి రూ.445.41 కోట్లు రిఫండ్
- » 2026లో ఇప్పటివరకు రూ.70.07 కోట్లు రికవరీ
- » యూపీఐ, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్ బాధితులకు ఊరట
- » సైబర్ మోసం వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి




హైదరాబాద్:
ప్రత్యేక లోక్‌అదాలత్ ద్వారా 6,303 మంది సైబర్ మోసం బాధితులకు రూ.45.21 కోట్లు రిఫండ్ చేసినట్లు తెలంగాణ పోలీసులు తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో 2,232 మందికి చెందిన రూ.21.91 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిధిలో 77 మందికి రూ.6.83 కోట్లు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు రికవరీలో అగ్రస్థానంలో నిలిచాయన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు నుంచి ఇప్పటివరకు 59,953 మంది బాధితులకు రూ.445.41 కోట్లు రిఫండ్ అయినట్లు తెలిపారు.
2026లో జూన్ 20 వరకు రూ.70.07 కోట్లు సైబర్ మోసగాళ్ల నుంచి రికవరీ చేసినట్లు వివరించారు. యూపీఐ, ఇన్వెస్ట్‌మెంట్, ఇంపర్సనేషన్ స్కామ్‌ల బాధితులకు వేగంగా న్యాయం చేసినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు కాల్/ఫిర్యాదు నమోదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

# బడంగ్‌పేట్‌లో పేలుడు.. వ్యక్తి మృతి




### కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు దగ్ధం

కొత్తపల్లి:
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు సమీపంలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు దగ్ధమైంది. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తోన్న ఆర్టీసీ బస్సులో.. అలుగునూరు సమీపంలోకి రాగానే పొగలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్.. బస్సులో ఉన్న 41 మంది ప్రయాణికులను కిందకు దించేశారు. ప్రయాణికులు బస్సులో నుంచి కిందకు దిగిన తర్వాత క్షణాల్లోనే బస్సు అంతా మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. పెను ప్రమాదం తప్పటంతో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



### పవన్ కళ్యాణ్ కమలంలో ఒక రెక్క..

### బీజేపీ ఆడిస్తున్న ఆటలో పావు:

### పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై ఘాటు వ్యాఖ్యలు చేశారు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. పవన్ కళ్యాణ్ కమలం పువ్వులో ఒక రెక్క అని... ఆయన బీజేపీ ఆడిస్తున్న ఆటలో పావుగా మారి వారు చెప్పినట్లు చేస్తున్నారని అన్నారు. రాజకీయంగా పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను తెలంగాణ ప్రజలు జీర్ణించుకోవట్లేదని అన్నారు.తెలంగాణ ఏర్పడితే... 11 రోజులు ఉపవాసం ఉన్నానని చెప్పిన పవన్ కళ్యాణ్ తెలంగాణ సెంటిమెంట్ గురించి మాట్లాడితే ఎవరు నమ్ముతారని అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ ముందుండి నడిపితే...

మిగతాద్ది 2 లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం జూన్ 22, 2026

## "బీజేపీ ఎన్నికల అధికారులతో కుమ్మక్కయ్యింది"

మొదటిపేజీ తరువాయి
రాష్ట్రం నుంచి తన కోసం రాజ్యసభ సీటు కేటాయిస్తానంటే తాను ఎట్టిపరిస్థితుల్లో ఒప్పుకోనని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. తన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన నేపథ్యంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళనని అక్కడి నుండి సీటు కేటాయించాలని తెలిపారు. తన సీటు కోసం ఎవరూ రాజీనామా చేయాల్సిన అవసరం లేదన్నారు.

మధ్య ప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ అవకాశం లేదని బీజేపీకి అర్థమైందని అందుకే ఎన్నికల అధికారులతో కుమ్మక్కు అయ్యిందని ఆరోపించారు. నత్వానీ కి ఇచ్చిన అవకాశం తనకు ఎందుకు ఇవ్వలేదని? 2023 రూల్ బుక్ అడ్డం పెట్టుకొని నత్వాని కి నామినేషన్ కరెక్షన్ కోసం 24 గంటలు ఇచ్చారని తనకు మాత్రం 2026 రూల్ బుక్ ప్రకారం నామినేషన్ కరెక్షన్ కోసం ఆ అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు.

తనకు సంబంధం లేని కేసు వల్ల నా నామినేషన్ తిరస్కరించారు. ప్రైవేట్ వ్యక్తి ఇచ్చిన కేసులో నాకు లీగల్ నోటీస్ వచ్చింది. లీగల్ నోటీస్ క్రిమినల్ కేసు ఎలా అవుతుందని ప్రశ్నించారు. నామినేషన్ పత్రంలో లీగల్ నోటీస్ అనే కాలమ్ లేనే లేదన్నారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో 62 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. రాజ్యసభ స్థానం గెలవాలంటే 58 మంది మాత్రమే అవసరం ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ గెలిచే సీటని బీజేపీకి తెలుసు అయినప్పటికీ కుట్రలో భాగంగానే నామినేషన్ వేశారన్నారు.తన కేసుల అంశాన్ని కాంగ్రెస్ నాయకులు ఇచ్చారనేది పచ్చి అబద్ధం బీజేపీ కావాలనే అబద్ధాలను సృష్టించింది. తానెప్పుడూ బాధితుల పక్షమేనని, శ్రీలతకు కూడా నేను అండగా ఉన్నానని తెలిపారు.రాజ్యసభ నామినేషన్ కేవలం కేసు ఉన్నంత మాత్రానా తిరస్కరణ కాలేదని, బీజేపీ,ఎన్నికల కమిషన్ పూర్తిగా కాంప్రమైజ్ అయింది కాబట్టే నామినేషన్ తిరస్కరణకు గురైందని తెలిపారు.కేవలం ఇది ఒక్క సీటుకు సంబంధించిన విషయం కాదని ఒకే దేశం ఒకే ఎన్నిక చేయాలని బీజేపీ చేస్తోందన్నారు.

## 'రాహుల్‌తో సమావేశం ఏర్పాటు చేయండి'

### రేవంత్‌కు రామచందర్‌రావు లేఖ

మొదటిపేజీ తరువాయి
2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, సోనియా, ప్రియాంకా గాంధీలు తెలంగాణ వ్యాప్తంగా పర్యటించి, స్వయంగా ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను నమ్మే జనం కాంగ్రెస్‌కు ఓటేశారని రామచందర్‌రావు అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఇంతకాలమవుతున్నా మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, వృద్ధులు, పేద కుటుంబాలు నేటికీ ఆ పథకాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, కాంగ్రెస్ నెరవేర్చని హామీలను నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లి నిలదీయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, సీఎం వెంటనే స్పందించి రాహుల్‌తో సమావేశాన్ని ఖరారు చేయించాలని డిమాండ్ చేశారు.

## బడంగ్‌పేట్‌లో పేలుడు.. వ్యక్తి మృతి

మొదటిపేజీ తరువాయి
నగరంలోని బడంగ్‌పేట్‌లో పేలుడు సంభవించింది. గుర్తుతెలియని పదార్థం పేలడంతో అనూప్ (43) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పేలుడు తీవ్రతకు అతడి శరీరభాగాలు దూరంగా ఎగిరిపడ్డాయి. ఇటీవల కోల్‌కతా నుంచి పనుల కోసం అనూప్ హైదరాబాద్ వచ్చినట్లు సమాచారం. పేలుడుకు కారణమైన పదార్థం ఏమిటన్న వివరాలపై పోలీసులు విచారణ చేపట్టారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## అట్టహాసంగా TG 20 లీగ్ ఓపెనింగ్ సెర్మనీ..

### హాజరైన భట్టి, సిరాజ్, రౌడీ బాయ్ విజయ్

మొదటిపేజీ తరువాయి
స్టార్ మ్యూజిక్ దర్శకుడు తమన్ ప్రత్యేక ప్రదర్శన టోర్నీ ఆరంభ వేడుకల్లో ఆద్యంతం ఆకట్టుకుంది.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభ గల క్రికెటర్లను వెలికితీసి ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ లీగ్ తీసుకొచ్చారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున టోర్నీ నిర్వాహకులను అభినందిస్తున్నామన్నారు. గతంలో క్రికెట్ అంటే అర్బన్ సెంటర్స్‌కు మాత్రమే అవకాశాలుండేవని.. మొదటిసారి ప్రతీ జిల్లాలో ఉండే క్రీడాకారులను గుర్తించి టీమ్స్‌ను సెలెక్ట్ చేసి నిర్వహిస్తున్న ఈ లీగ్ దేశానికి మార్గదర్శకంగా ఉంటుందని పేర్కొన్నారు.నైపుణ్యం ఉన్న గ్రామీణ క్రీడాకారులకు టీజీ 20 లీగ్ అద్భుతమైన వేదిక అని చెప్పారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గజం మెస్సీ ను హైదరాబాద్‌కి తీసుకొచ్చామని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో స్పోర్ట్స్ యూనివర్సిటీ తీసుకురబోతున్నామని తెలిపారు. భవిష్యత్‌లో ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచి మెడల్స్ పొందేలా శిక్షణ ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం పునాదులు వేస్తుందని పేర్కొన్నారు. టీజీ20 బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. టీజీ- 20లో భాగస్వామ్యం అవడం తనకు చాలా సంతోషంగా ఉందని అన్నాడు. ఒకప్పుడు క్రికెట్‌లో హైదరాబాద్ నుంచి తక్కువ మంది ఉండేవాళ్లన్నారు. హైదరాబాద్ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్‌ను చూసి గర్వపడేవాళ్లమని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్ టీమిండియాకు ప్రాతినిధ్యం వహించడం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో ఇలాంటి లీగ్ జరగడం వల్ల ఎంతో మందికి అవకాశం వస్తుందని పేర్కొన్నారు.

## పవన్ కళ్యాణ్ కమలంలో ఒక రెక్క.. బీజేపీ ఆడిస్తున్న ఆటలో పావు: పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

మొదటిపేజీ తరువాయి
ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది యూపీఏ ప్రభుత్వం, సోనియా గాంధీ అని అన్నారు. తెలంగాణ ప్రజలకు మరో పార్టీ అక్కర్లేదని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. తాను చిరంజీవికి అభిమానని కానీ... పవన్ కళ్యాణ్ తెలంగాణ ఆవిర్భావ దినం రోజే సభలు పెడతామంటే లా అండ్ ఆర్డర్ కు విఘాతం కలగదా అని ప్రశ్నించారు మహేష్ కుమార్ గౌడ్. ఇక కర్ణాటకలో సీఎం మార్పుపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు మహేష్ కుమార్ గౌడ్. ముందస్తు ఒప్పందంలో భాగంగానే కర్ణాటకలో సీఎం మార్పు జరిగిందని... అక్కడి పరిస్థితులు వేరు, తెలంగాణలో పరిస్థితులు వేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీని మోసం చేయాల్సిన అవసరం రేవంత్ రెడ్డికి లేదని అన్నారు మహేష్ కుమార్ గౌడ్.

## బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

### వారం పాటు బెయిల్ మంజూరు చేసిన కోర్టు

కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా భగీరథ్ జైలు జీవితం అనుభవిస్తున్నాడు. తాజాగా ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో న్యాయవాదులు మధ్యంతర బెయిల్ కోరారు. వాదనల విన్న కోర్టు నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదిలా ఉండగా.. గత నెలలో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయాడు. ఇక, నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గతంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకుముందు రెండు గంటలకుపైగా సిట్ అధికారులు అతడిని విచారించారు. అప్పటి నుంచి నెల రోజులకు పైగా జైలు జీవితం గడిపిన భగీరథ్ తాజాగా బెయిల్‌పై బయటకు రానున్నాడు.

## పీఎం కిసాన్ డబ్బులు విడుదల

### రూ. 2,000 చొప్పన 18,880 కోట్లు జమ

హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

లపీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్నిధులు విడుదలయ్యాయి.

పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కేందప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్ధిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

## 'వీబీ జీ రామ్ జీ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి'



కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వీబీ-జీ రామ్-జీ చట్టం దేశంలోని కోట్లాది గ్రామీణ పేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదకరమైన చట్టమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం మొదటి సమావేశం ఇవాళ (ఆదివారం) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉపసంఘం చైర్మన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మంత్రివర్గ ఉపసంఘ సభ్యులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, గడ్డం వినోద్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పంచాయతీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ పేదలకు కల్పించిన హక్కులను క్రమంగా నిర్వీర్యం చేసి, రాష్ట్రాల అధికారాలను హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా ఈ కొత్త చట్టాన్ని తీసుకువస్తోందని ఆయన ఆరోపించారు. "ఉపాధి హామీ చట్టం కేవలం ఒక పథకం కాదు.. అది గ్రామీణ భారతదేశానికి ఆర్థిక భరోసా కల్పించిన సామాజిక విప్లవం. అలాంటి చట్టాన్ని బలహీనపరచడం అంటే రైతులు, కూలీలు, మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవితాలతో ఆటలాడటమే" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ప్రతిపాదిత చట్టం ద్వారా రాష్ట్రాల పాత్రను తగ్గించి, అన్ని అధికారాలను ఢిల్లీ చేతుల్లో కేంద్రీకరించాలనే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణలో రాష్ట్రాలకు ఉన్న స్వేచ్ఛను హరించడం సహకార సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు.

## భద్రాద్రి కొత్తగూడెంలో ఘోర రోడ్డు ప్రమాదం




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మాదారం గ్రామ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళు _న్న ఒక కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.మృతులను భద్రాచలానికి చెందిన దూడల సాయి ప్రకాష్, ఆయన భార్య సంధ్య, మరియు వారి కుమారుడు మోక్ష్‌గా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో సాయి ప్రకాష్ తల్లి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కక్షసాధింపు కోసం ఆర్టీఐ దుర్వినియోగం మదనపల్లి డిగ్రీకాలేజీ వ్యవహారంలో ఫిర్యాదు కొట్టివేత

**పదేపదే కావాలనే ఆర్టీఐ దరఖాస్తు చేసినట్లు కమిషన్ గుర్తింపు**

సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ చట్టాన్ని వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి లేదా ప్రభుత్వ అధికారులను వేధించడానికి వినియోగిస్తే సహించబోమని తేల్చి చెప్పింది. పారదర్శకత, జవాబుదారీ తనాన్ని పెంపొందించేందుకు తీసుకొచ్చిన దీన్ని దుర్వినియోగం చేయడంపై అసహనం వ్యక్తం చేసింది. మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు సంబంధించిన కేసులో ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఫిర్యాదుదారుడు పదేపదే ఆర్టీఐ దరఖాస్తులు దాఖలు చేసి పలువురిని ఇబ్బందులకు గురి చేయడంపై ఆగ్రహించింది. ఈ మేరకు ఫిర్యాదుదారుడి రెండో అప్పీల్‌ను కమిషన్ కొట్టివేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఫిర్యాదుదారుడు పదేపదే ఆర్టీఐ దాఖలు చేసినట్లు విచారణలో వెల్లడైందని కమిషన్ తెలిపింది. ఇప్పటికే అతను కోరిన సమాచారాన్ని కళాశాల అధికారులు అందించినప్పటికీ, అదే అంశాలపై మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేయడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగంపై అనవసర భారం మోపినట్లు కమిషన్ గుర్తించింది. ఈ సందర్భంగా కళాశాల అధికారులు అవసరమైన సమాచారాన్ని పూర్తిగా అందించారని, కమిషన్ గతంలో ఇచ్చిన ఆదేశాలను సక్రమంగా అమలు చేశారని నిర్ధారించింది. విచారణలో భాగంగా ఫిర్యాదుదారుడు 800కు పైగా పేజీల సమాచారాన్ని ఉచితంగా పొందిన విషయాన్ని కమిషన్ ప్రస్తావించింది. అయినప్పటికీ అదే సమాచారాన్ని పునరావృతంగా కోరుతూ అధికారులను ఇబ్బందులకు గురిచేసినట్లు పేర్కొంది. ముఖ్యంగా మహిళా కళాశాల సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని వ్యవహరించడం ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. మహిళా సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించిన ఘటనలకు సంబంధించి ఫిర్యాదుదారుడిపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైందని తెలిపింది. సంబంధిత కేసుల్లో కోర్టు శిక్ష కూడా విధించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ఆధారాలు లేని ఆరోపణలను కమిషన్ తోసిపుచ్చింది. ఆర్టీఐ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు తేలడంతో ఫిర్యాదుదారుడిపై బ్లాక్‌లిస్ట్ చర్యలు తీసుకుంటూ, భవిష్యత్తులో అతడి నుంచి వచ్చే ఆర్టీఐ దరఖాస్తులను స్వీకరించరాదని కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు తీర్పులనూ కమిషన్ ప్రస్తావించింది.కేసుపై పూర్తి విచారణ అనంతరం ఫిర్యాదుదారుడి రెండో అప్పీల్‌ను కొట్టివేస్తూ విచారణను ముగించినట్లు కమిషన్ వెల్లడించింది.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే ఢిల్లీలో మరోమారు ఆందోళనకు దిగిన కాక్రోచ్ పార్టీ

ఢిల్లీలో హైటెన్షన్ నెలకొంది. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)' ఆందోళనల్లో ఉద్రిక్తత నెలకొంది. నీట్ పేపర్ లీక్, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్లతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అయితే, తమ నిరసన టైమ్ పొడగించాలని సీజేపీ డిమాండ్‌ను పోలీసులు తిరస్కరించారు. దీంతో నిరసనకారుల్ని పోలీసులు ఆ ప్రదేశం నుంచి శాంతియుతంగా తొలగించడంతో ఉద్రిక్తత మొదలైంది. సాయంత్రం 6 గంటలకు కూడా మద్దతుదారులు పెద్ద సంఖ్యలో చేరాలని సీజేపీ పిలుపునిచ్చింది. అయితే, ఢిల్లీ పోలీసులు మాత్రం గడవు

ముగిసిందని, నిరసనకారులు ప్రదేశాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు. జంతర్ మంతర్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, ఎస్ఎఫ్ఐకి చెందిన పలువురు విద్యార్థి నాయకులు ఇంకా వేదికపైనే ఉన్నారు. దీనికి ముందు జనాలను ఉద్దేశిస్తూ ప్రసంగించిన దీప్కే.. శాంతియుత నిరసనకు అనుమతి పొడగించాలని ఢిల్లీ పోలీసుల్ని కోరారు. చర్చలకు మేం సిద్ధం, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలనేది మా డిమాండ్. బలవంతంగా మమ్మల్ని తొలగించడానికి పోలీసులు అరెస్ట్‌లు చేస్తే, అరెస్ట్ అయ్యే వారిలో నేనే మొదటి వ్యక్తిని అవుతానునని దీప్కే అన్నారు.

## నగరంలో పలుచోట్ల భారీ వర్షం

### జలమయమైన లోతట్టు ప్రాంతాలు

భాగ్యనగరంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడుతుండటంతో పలు ప్రాంతాలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగిపోగా, ప్రధాన రహదారులపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాదాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ పంజాగుట్ట,

బేగంపేట్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, టోలిచౌకి వంటి పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. జీహెచ్ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షం కారణంగా భాగ్యనగరంలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఐటీ కారిడార్ పరిధిలోని మాదాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ రోడ్లతో పాటు పంజాగుట్ట, అసెంబ్లీ పరిసర ప్రాంతాలు, సికింద్రాబాద్ పరిధిలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకు పోయారు. పరిస్థితిని సమీక్షించిన నగర పాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. త్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానికి మెట్రో రైలు సేవలను వినియోగించుకోవాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ మాన్‌సూన్ ఎమ్జర్గ÷న్సీ టీమ్స్ రోడ్లపై నిలిచిన నీటిని తొలగించేందుకు నిరంతరం శ్రమిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## అరుదైన వ్యాధిగ్రస్తులకు సర్కార్ అండ

ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడి

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుదైన వ్యాధిగ్రస్థులకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు ప్రత్యేక పాలసీ రూపొందించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 'నేషనల్ పాలసీ ఫర్ రేర్ డిసీజెస్-2021'కు అనుగుణంగా నూతన పాలసీని త్వరగా తయారు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్య సేవలు, బాధితులకు తోడ్పాటును అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ చెప్పారు. అలాగే మూడు రిఫరల్ కేంద్రాలు, ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రేర్ డిసీజెస్ రిజిస్ట్రీ ఏర్పాటు, వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు పాలసీ తయారీపై సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు సత్యకుమార్ తెలిపారు. మంత్రి లోకేశ్ చొరవ తీసుకుని పాలసీ తయారీకి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. అతి త్వరలో పాలసీని రూపొందించి అరుదైన వ్యాధిగ్రస్థులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి సత్యకుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# ఎస్బిఐ లైఫ్ ఆఫీసులో ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు.

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, జూన్ 21**



హుజురాబాద్ పట్టణంలోని ఎస్బిఐ లైఫ్ ఆఫీసులో ఫాదర్స్ డే ను పురస్కరించుకొని ఆదివారం ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ చేసిన ఐదుగురు కస్టమర్ల(ఫాదర్)ను లైఫ్ మిత్ర తవటం సంపత్ కుమార్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. స్వీట్స్ పంచిపెట్టి ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో కుటుంబంలో ఫాదర్ లకు ప్రత్యేక గుర్తింపు, బరువు బాధ్యతలు ఉంటాయని ఈ సందర్భంగా ఎస్బిఐ డివిజనల్ సీనియర్ మేనేజర్ సతీష్, యూనిట్ మేనేజర్ బి రమేష్ లు పేర్కొన్నారు. కుటుంబ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తండ్రులు పిల్లలకు కుటుంబ సభ్యులకు ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సన్మానం పొందిన వారిలో లైఫ్ ఇన్సూరెన్స్ చేసిన కస్టమర్లు కడవెరువు సత్యం, వోడ్నాల రామకృష్ణ, మంచికట్ల సమ్మయ్య, సందుపట్ల సదానందం, రాజులను అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్స్ తినిపించి ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్లు, కార్యాలయ ఉద్యోగులు, పలువురు తండ్రులు పాల్గొన్నారు.

# కోటి రాణి పార్కులో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూన్ 21**



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బజరంగ్ సేన తెలంగాణ, ఆర్ఎస్ఎస్ మహావీర్ శాఖ, రాణి పార్క్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కోటి బ్యాంక్ స్ట్రీట్, రాణి పార్కులో యోగా కార్యక్రమాన్ని నిర్వహించాయి.

ఆరోగ్యకరమైన మనస్సు, శరీరం కోసం యోగా ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి ప్రజలు, స్వచ్ఛంద కార్యకర్తలు ఏకమై ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు హన్మంత్ రావు, బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. ఆర్. లక్ష్మణ్ రావు, రాము, మహేష్, కృష్ణ, హనుమంత్ రావు, పాండే, బసవరాజ్, ఇతర ప్రముఖులు యోగా కార్యక్రమంలో పాల్గొని యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు.యోగాను ఒక జీవన విధానంగా స్వీకరించి, ఆరోగ్యకరమైన సమాజానికి దోహదపడతామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు.

# నీట్-2026 పరీక్షలకు మట్వాడ పోలీసుల పటిష్ట బందోబస్తు



**కరపత్రం ప్రతినిధి వరంగల్ జూన్ 21**

నీట్–2026 ప్రవేశ పరీక్షల సందర్భంగా మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షలు ప్రశాంతంగా,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు పోలీసు అధికారులు,సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించిన పోలీసులు,విద్యార్థులు ఎలాంటి భయం లేదా ఆందోళన లేకుండా పరీక్షలకు హాజరయ్యేలా అనుకూల వాతావరణాన్ని కల్పించారు.ట్రాఫిక్ నియంత్రణతో పాటు కేంద్రాల వద్ద క్రమశిక్షణను సమర్థవంతంగా అమలు చేశారు.అలాగే పరీక్షలకు వచ్చిన విద్యార్థులు,వారి తల్లిదండ్రులకు అవసరమైన సూచనలు, సహాయ సహకారాలు అందిస్తూ పోలీసు సిబ్బంది సేవాభావాన్ని చాటుకున్నారు. మట్వాడ పోలీసుల సమన్వయంతో పరీక్షలు సజావుగా సాగినట్లు అధికారులు తెలిపారు.

# ఉమంగ్ 2026లో ఎస్ఎస్సీ టాపర్లకు నగదు పురస్కారాలు

**కరపత్రం ప్రతినిధి వరంగల్ జూన్ 21**




విద్యార్థుల్లో ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరణ కల్పించడమే లక్ష్యంగా వరంగల్ సియాసత్ హబ్ ఫౌండేషన్,ఉమంగ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఉమంగ్--2026' కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్ కార్యక్రమంతో పాటు ఎస్ఎస్సీ టాపర్ల సన్మానోత్సవాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమిర్ అలీ ఖాన్ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి అభినందించారు.కార్యక్రమం హాఫిజ్ సయ్యద్ సాదిక్ హుస్సేన్ ఖిరాత్–ఏ–కలామ్ పాక్‌తో ప్రారంభమైంది.ఈ సందర్భంగా ఆమిర్ అలీ ఖాన్ మాట్లాడుతూ,విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని,ఉన్నత విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కష్టపడి చదివి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.భవిష్యత్‌లో అందుబాటులో ఉన్న వివిధ కెరీర్ అవకాశాలు,కోర్సుల ఎంపిక,నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాలపై విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.కార్యక్రమంలో డాక్టర్ అనీస్ అహ్మద్ సిద్ధిఖీ,మహమ్మద్ సిరాజ్ అహ్మద్,మహమ్మద్ ముజాహిద్ ఇర్ఫాన్,సయ్యద్ సుభానుద్దీన్,ఎం.ఏ.అలీమ్,మీర్జా కమర్ అలీ బేగ్,ఎం.ఏ.ఖయ్యూమ్,మహమ్మద్ ఇక్బాల్,మహమ్మద్ నసీరుద్దీన్,మహమ్మద్ రిజ్వాన్,రామగుండం కార్పొరేటర్ మహమ్మద్ మజీద్ ఖాన్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.పెద్ద సంఖ్యలో విద్యార్థులు,తల్లిదండ్రులు,విద్యావేత్తలు మరియు సామాజిక ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం విశేష ఆదరణ పొందింది.

# వరంగల్ అభివృద్ధిపై మాట్లాడే ముందు కేసీఆర్, కేటీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 21**

హనుమకొండ, వరంగల్ నగర అభివృద్ధిని పదేళ్లపాటు విస్మరించిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. వరంగల్‌కు వచ్చే ముందు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నాయని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను కేసీఆర్, బీజేపీ నాయకులు పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. అక్రమ సంపాదనతో కూడబెట్టిన డబ్బుతో ప్రజలకు తాత్కాలిక ప్రయోజనాల పేరుతో వస్తువులు పంపిణీ చేయడం సిగ్గుచేటని, అలాంటి కార్యక్రమాలకు మాజీ మంత్రి హరీశ్ రావు హాజరుకావడం బాధాకరమన్నారు.

వరంగల్ నగరంలోని మాడ వీధుల అభివృద్ధికి రూ.11 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి తో ప్రత్యేకంగా చర్చించి జూన్ 12న రూ.19 కోట్ల నిధులు మంజూరు చేయించామని, వాటిని గత ప్రభుత్వ విజయాలుగా ప్రచారం చేయడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థతో పాటు నగర అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల



కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు.

వైఎస్ఆర్ నగర్ భూముల అంశంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు, సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర సర్వే నిర్వహించాలని ప్రతిపాదించారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి హైడ్రా తరహాలో తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి పార్టీ కార్యాలయాలు నిర్మించిన చరిత్ర బీఆర్ఎస్‌కేనని ఆరోపించిన ఆయన, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు వెల్లడించారు. వైఎస్ఆర్ నగర్ భూమి ప్రభుత్వ భూమిగా తేలితే ప్రజా రవాణా, పరిపాలనా అవసరాల కోసం వినియోగించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో రాజకీయంగా ఎదిగిన నాయకులే ఇప్పుడు ఆ పార్టీపై విమర్శలు చేయడం విచారకరమన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు ఏకపక్ష ధోరణిని ప్రతిబింబిస్తున్నాయని విమర్శించారు. ప్రజలు అభివృద్ధి పనులను గమనిస్తున్నారని, పనిచేసే నాయకులను మాత్రమే ఆదరిస్తారని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేస్తోందని చెప్పారు. గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా లబ్ధిదారులకు అందించడంలో విఫలమైందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించినట్లు తెలిపారు. మామునూరు విమానాశ్రయ అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయని ఆరోపించిన ఎమ్మెల్యే, దేశవ్యాప్తంగా కొత్త విమానాశ్రయాలకు అనుమతులు లభిస్తున్న సమయంలో మామునూరు కోసం భూసేకరణ పూర్తయినా నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి భారీగా పన్నులు వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగిన నిధులు కేటాయించడం లేదన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించని నాయకులు తెలంగాణ ఉద్యమ వారసత్వం గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహనీయులను గౌరవిస్తూ వారి సేవలను స్మరించుకుంటోందన్నారు.

వరంగల్ నగర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, పారదర్శక పాలన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాలుర పరిశీలక గృహంలో యోగా డే నిర్వహణ

- ఆరోగ్యకరమైన శరీరం -- ప్రశాంతమైన మనస్సుకు యోగానే మార్గం: ఎ. ప్రదీప్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 21**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆటోనగర్‌లోని బాలుర పరిశీలక గృహంలో ఆదివారం యోగా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ. ప్రదీప్ పాల్గొని బాలురకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా అనేది కేవలం శారీరక వ్యాయామాలకు మాత్రమే పరిమితం కాదని, శరీరం, మనస్సు, ఆలోచనల మధ్య సమతుల్యతను నెలకొల్పే గొప్ప సాధనమని అన్నారు. ఆధునిక జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనలను




అధిగమించి మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

ప్రతిరోజూ ధ్యానం, ప్రాణాయామం చేయడం ద్వారా ఏకాగ్రత పెరిగి, జీవిత లక్ష్యాలను చేరుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. పరిశీలక గృహంలో గడుపుతున్న సమయాన్ని క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథాన్ని అలవర్చుకునేందుకు వినియోగించుకోవాలని బాలురకు సూచించారు.

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం కట్టుబడి ఉంటుందని, అవసరమైన చట్టపరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సమాజం లో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడమే సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, ప్రతిరోజూ కనీసం 15 నుంచి 20 నిమిషాలు యోగా సాధన చేయాలని బాలురతో ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయమూర్తులు రితిక నందికొండ, చంద్ర ప్రసన్న, రాజ్ నిధి పాల్గొని బాలురతో కలిసి యోగా చేశారు. హోమ్ సూపరింటెండెంట్ శ్రీదేవి, హోమ్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి, మానసిక ప్రశాంతత సాధ్యమని వక్తలు పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# హనుమకొండలో చైన్ స్నాచింగ్..

- వృద్ధురాలి మెడలోని మూడు తులాల బంగారు గొలుసు అపహరణ
- వివరాలు సేకరించిన పోలీసులు

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 21**

హనుమకొండలోని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. ఇంటి సమీపంలో ఉన్న ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి అపహరించి పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌బీహెచ్ కాలనీలో నివాసం ఉంటున్న పెద్దిరెడ్డి పుష్పలత (69) ఆదివారం ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో తన ఇంటి సమీపంలో ఉండగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో ధరించిన సుమారు మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని వేగంగా అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న సుబేదారి ఇన్స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ బాధితురాలి నివాసానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు



నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. సంఘటన జరిగిన ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితులను త్వరలోనే గుర్తించి అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు ఒంటరిగా



బయటకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

# ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో బీఎల్ఏలు కీలక పాత్ర పోషించాలి

- ప్రతి అర్హ ఓటరు జాబితాలో ఉండేలా సహకరించాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 21**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) క్రియాశీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ కోరారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించి శనివారం హనుమకొండలోని లాల్ బహదూర్ కళాశాలలో వరంగల్ తూర్పు నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఓటర్ల జాబితా సంపూర్ణంగా, పారదర్శకంగా రూపొందేందుకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు)తో పాటు బూత్ లెవల్ ఏజెంట్ల బాధ్యత కూడా ఎంతో కీలకమని తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో నుంచి మిస్ కాకుండా ప్రతి ఇంటికి వెళ్లి సంబంధిత ఫారాలను అందజేసి నమోదు ప్రక్రియను సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మాత్రమే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతుందని, మరణించినవారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారినవారు లేదా ఒకే వ్యక్తి పేరు రెండుసార్లు నమోదైన సందర్భాల్లో మాత్రమే పేర్ల తొలగింపు చేపడతామని స్పష్టం చేశారు. మ్యాపింగ్ ప్రక్రియకు ఈ తొలగింపులకు ఎలాంటి




సంబంధం లేదని వివరించారు. ఓటర్లకు కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు లేదా సందేహాలు ఉన్నా వాటి పరిష్కారం కోసం ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రతి గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, కార్యక్రమానికి సంబంధించిన సందేహాలు, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పారు. బీఎల్ఏలు తమకు ఎదురయ్యే సమస్యలను ఈ సమావేశాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద అవసరాన్ని బట్టి అదనపు బూత్‌ల ఏర్పాటు కూడా చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను



నిష్పక్షపాతంగా, సమగ్రంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన విధివిధానాలు, అనుసరించాల్సిన ప్రక్రియలు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై మాస్టర్ ట్రైనర్ సందీప్ కుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. ఓటర్ల నమోదు, ధృవీకరణ, ఫారాల నిర్వహణ, అర్హత ప్రమాణాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల అమలు వంటి అంశాలను వివరంగా వివరించారు. అలాగే బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) వ్యక్తం చేసిన సందేహాలకు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు మహ్మద్ ఇక్బాల్, శ్రీకాంత్, బూత్ లెవల్ ఏజెంట్లు, ఎన్నికల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుండ్ల సింగారంలో గుడిసెల కూల్చివేతపై ఆగ్రహం

- పేదలకు ఇండ్లు ఇవ్వాల్సింది పోయి ఉన్న గుడిసెలనే కూల్చివేస్తారా?
- బీకేవైయూ నాయకుడు వెంకట్రాములు



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 21**

హనుమకొండ నగరంలోని గుండ్ల సింగారంలో నిరుపేదలు నివాసం ఉంటున్న గుడిసెలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పోలీసు బలగాల సహాయంతో కూల్చివేయడాన్ని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేవైయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా ఖండించారు.

శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా గుడిసెల్లో నివాసం ఉంటున్న పేద కుటుంబాలను ముందస్తు సమాచారం లేకుండా ఖాళీ చేయించి గుడిసెలను నేలమట్టం చేయడం అమానుష చర్య అని విమర్శించారు. రెక్కాడితే గానీ డొక్కాడని కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేదలపై అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించడం బాధాకరమన్నారు.

గుడిసెల కూల్చివేతను అడ్డుకునేందుకు ప్రయత్నించిన సీపీఐ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం ప్రభుత్వ దమనకాండకు నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇల్లు లేని పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ గృహాలు నిర్మిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఆ వాగ్దానాలను అమలు చేయకుండా పేదల ఆశ్రయాలను ధ్వంసం చేయడం సరైన విధానం కాదన్నారు. బడా వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వర్గాలు ప్రభుత్వ భూములను ఆక్రమించినా చర్యలు తీసుకోని అధికారులు, కేవలం నివాసం కోసం చిన్న స్థలంలో గుడిసె వేసుకున్న పేదలపై మాత్రం కఠిన చర్యలకు దిగడం అన్యాయమని వెంకట్రాములు పేర్కొన్నారు. గుడిసెల కూల్చివేతతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బియ్యం, నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, దుస్తులు, పిల్లల పుస్తకాలు శిథిలాల కింద పడి నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల ఖమ్మంలో జరిగిన ఇలాంటి ఘటన మరువకముందే హనుమకొండలో మరోసారి పేదల గుడిసెలను కూల్చివేయడం ప్రభుత్వ వైఖరిపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు ఈ ఘటనను ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

గుండ్ల సింగారం గుడిసె వాసులకు వెంటనే ప్రత్యామ్నాయ నివాస సౌకర్యం కల్పించాలని, నష్టపోయిన కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, ఇండ్ల స్థలాలు మంజూరు చేసి ఇందిరమ్మ గృహాలు నిర్మించాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదల సమస్యలను విస్మరిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# దివ్యాంగులకు రాజకీయ అవకాశాలు కల్పించాలి కవితకు వినతి

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ జూన్ 21**



దివ్యాంగులకు రాజకీయ అవకాశాలు కల్పించి,పార్టీ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాలని నవతెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అజీమ్ నేతృత్వంలోని దివ్యాంగ నాయకులు తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అధినేత కల్వకుంట్ల కవితను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. హనుమకొండలోని బాలసముద్రంలో జరిగిన కార్యక్రమంలో వారు కవితను కలిసి తమ డిమాండ్లను వివరించారు.ఈ సందర్భంగా మహమ్మద్ అజీమ్ మాట్లాడుతూ.. తెలంగాణలో దివ్యాంగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ,వారి సమస్యలను వివిధ వేదికలపై ప్రస్తావించిన కవితకు దివ్యాంగుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో జాగృతి సంస్థ ద్వారా జరిగిన శాసనసభ,పార్లమెంట్ ఎన్నికల్లో దివ్యాంగులు తమ వంతు సహకారం అందించారని గుర్తుచేశారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో దివ్యాంగుల విభాగాన్ని ఏర్పాటు చేసి,వారికి తగిన రాజకీయ ప్రాధాన్యతతో పాటు పదవులు, అవకాశాలు కల్పించాలని కోరారు.దివ్యాంగుల ఓటు బ్యాంకును గుర్తించి పార్టీ నిర్మాణంలో భాగస్వామ్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దివ్యాంగులు పార్టీకి అండగా నిలుస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు,వరంగల్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి సుశీల్ గౌడ్,సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ మజీద్,దివ్యాంగుల రాష్ట్ర సలహాదారు చదలవాడ లక్ష్మీనారాయణ,రాష్ట్ర సహాయ కోశాధికారి బైల గోపి,హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎం.డి.అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ పిల్లల అడ్మిషన్‌తో ప్రభుత్వ పాఠశాలపై పెరిగిన దృష్టి

- వ్యవస్థపై నమ్మకానికి ప్రతీక.. విద్యా ప్రమాణాలకు పరీక్ష

**కరపత్రం ప్రతినిధి మేడ్చల్-మల్కాజ్గిరి, జూన్ 21**

ఒక జిల్లా కలెక్టర్ తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం కేవలం వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదు.. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ఉన్న నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తోంది. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై మరింత దృష్టి సారించే పరిస్థితిని సృష్టిస్తోంది.

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల విషయంలో మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, పర్యవేక్షణ వంటి అంశాలపై విమర్శలు వినిపిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం అరుదుగా కనిపించే విషయం. అందుకే కలెక్టర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్ పిల్లలు చదివే పాఠశాలపై సహజంగానే అధికారుల పర్యవేక్షణ పెరుగుతుంది. ఉపాధ్యాయుల హాజరు, బోధన ప్రమాణాలు, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ కనబడే అవకాశం ఉంటుంది. దీంతో ఆ పాఠశాలలో చదివే ఇతర విద్యార్థులు కూడా మెరుగైన విద్యా వాతావరణాన్ని పొందుతారు. విద్యావేత్తల అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే వాటిని అమలు చేసే అధికారులు కూడా వాటిని వినియోగించాలి. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, రవాణా వ్యవస్థలను ఉన్నతాధికారులు తమ కుటుంబ అవసరాల కోసం ఉపయోగించినప్పుడు వాటి నాణ్యత మెరుగుపర్చేందుకు మరింత కృషి జరిగే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. గతంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఆకునూరి మురళి తన కుటుంబ అవసరాల కోసం ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించడం కూడా అప్పట్లో చర్చనీయాంశమైంది. అలాంటి నిర్ణయాలు ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో సానుకూల భావన పెంచాయని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అయితే శాశ్వత మార్పు కోసం ఒక్క పాఠశాలకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సమానమైన మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండేలా చర్యలు అవసరమని విద్యా రంగ నిపుణులు సూచిస్తున్నారు. కలెక్టర్ పిల్లల అడ్మిషన్ ఒక సాధారణ ప్రవేశం కాకుండా, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకానికి ప్రతీకగా, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఒక సానుకూల సంకేతంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నవభారత నిర్మాణానికి యోగే బాట



- డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 21**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పరకాల నియోజకవర్గంలోని నడికూడ మండల కేంద్ర ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఎరుకల దివాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి యోగాసనాలు వేసిన డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, యోగా భారతీయ సంస్కృతి ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కృషి ఫలితంగానే యోగాకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని, నేడు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకుంటున్నారని తెలిపారు.

ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కోసం యోగా అత్యంత అవసరమని ఆయన అన్నారు. యోగా కేవలం వ్యాయామ విధానం మాత్రమే కాదని, శరీరం-మనస్సు-ఆత్మల సమన్వయాన్ని కల్పించే సంపూర్ణ జీవన విధానమని వివరించారు. నిత్య యోగా సాధనతో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు మానసిక ఉల్లాసం, ఏకాగ్రత కూడా మెరుగుపడతాయని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ విశ్వగురువుగా ఎదుగుతున్న నేపథ్యంలో యోగా ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిష్ఠను మరింత పెంచిందని డాక్టర్ కాళీ ప్రసాద్ రావు పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ తీర్మానానికి విశేష మద్దతు కూడగట్టడంలో ప్రధాని మోడీ పాత్ర చారిత్రాత్మకమని కొనియాడారు.

కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగా సాధనతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వక్తలు ఆకాంక్షించారు.

# యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

» తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూన్ 21**





యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి పౌరుడు కంకణబద్ధుడు కావాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య పిలుపునిచ్చారు. నేటి యువత దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలక శక్తి అని, వారు మాదక ద్రవ్యాలపై మళ్లకుండ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరముందన్నారు." డ్రగ్స్ ఫ్రీ-యంగ్ ఇండియా" లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, ఈగల్ ఫోర్స్ సహకారంతో ఆదివారం హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియం తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో "శపథ్" పేరుతో యువతకు అవగాహనా మరియు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు సందీప్ శాండిల్య, తెలంగాణ బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి.హనుమంతరావు, మాజీ ఎంపి గిరీష్ సంఘీ, ఈగల్స్ ఫోర్స్ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణామూర్తి గుప్తా, "శపథ్" నిర్వహణ కమిటీ అధ్యక్షులు రామ్ నివాస్ బన్సల్, ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవేంద్ర శాస్త్రీ, "శపథ్" పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ సునీల్ అగర్వాల్, సలహాదారులు రాజీవ్ అగర్వాల్, విశాల్ కేడియా, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అనిల్ సింగ్, ప్యాట్రన్లు అనిరుధ్ గుప్తా, నరేంద్ర గోయల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందీప్ శాండిల్యతెలంగాణలో డ్రగ్స్ వినియోగం ఆందోళనకరమైన స్థాయికి చేరుకుందని, ఈ మహమ్మారిని ఎదుర్కొనేందుకు సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా పోరాడాలన్నారు. 2019లో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎఐఐఎంఎస్), కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన సర్వే వివరాల ప్రకారం గంజాయి వినియోగంలో దేశంలోనే తెలంగాణ 28వ స్థానంలో ఉందన్నారు. అదేవిధంగా ఓపియాయిడ్స్ రాష్ట్రం 23వ స్థానం, అపస్మారక మందులు 19వ స్థానం, కొకైన్ వినియోగంలో తెలంగాణ 10వ స్థానంలో ఉందని వెల్లడించారు.హాలూసినోజెన్స్ వినియోగంలో రాష్ట్రం 3వ స్థానంలో ఉండగా, నేరుగా శరీరంలోకి డ్రగ్స్ ఇంజెక్ట్ చేసుకునే వారి సంఖ్యలో దేశంలోనే తెలంగాణ 5 వ స్థానంలో ఉండటం అత్యంత కలవరపరిచే అంశమన్నారు. రాష్ట్రంలో దాదాపు 30 వేల మంది కొకైన్ వినియోగదారులు ఉన్నట్లు సర్వే అంచనా వేసిందని చెప్పారు. 2019 నాటికే తెలంగాణలో వివిధ రకాల డ్రగ్స్ బారిన పడిన వారి సంఖ్య దాదాపు 22.5 లక్షలుగా ఉండగా ప్రస్తుత 2026 నాటికి ఈ సంఖ్య రెట్టింపై ఉండవచ్చని ఆయన అంచనా వేశారు. రాష్ట్రంలోని 4 కోట్ల జనాభాలో, గుట్కా, సిగరెట్లు, మద్యం మినహాయించి కేవలం డ్రగ్స్‌కు బానిసలైన వారే దాదాపు 50 లక్షల వరకు ఉండే అవకాశం ఉందన్నారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరోలో కేవలం 100 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారని, ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న వ్యసనపరులను పర్యవేక్షించడం కేవలం పోలీసుల వల్లే సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనించాలని సూచించారు. అదేవిధంగా సమాజంలోని వివిధ కుల సంఘాలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు అందరూ బాధ్యతగా ముందుకు వచ్చి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడానికి నడుం బిగించాలని సందీప్ శాండిల్య పిలుపునిచ్చారు. గిరిష్ సంఘీ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా అగర్వాల్ సమాజ్ చేపపడుతున్న ఈ కార్యక్రమానికీ ఆర్థికం, అన్నివిధాలుగా సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. యువత డ్రగ్స్ భారిన పడకుండ తల్లిదండ్రులతో పాటు స్నేహితులది కూడ బాధ్యతే అన్నారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ కాన్సర్‌కంటే ప్రమాదకరంగా మారిన డ్రగ్స్ భూతాన్ని తరిమి కొట్టడానికి ఒక పోలీసు శాఖ శక్తి సరిపోదని, సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు.

# బీజేపీలోకి భారీ చేరికలు..



- బీఆర్ఎస్ మాజీ సోషల్ మీడియా కన్వీనర్ సహా పలువురు యువ నాయకుల చేరిక

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 21**

పరకాల నియోజకవర్గ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సంగెం మండలానికి చెందిన పలువురు యువ నాయకులు, కార్యకర్తలు ఆదివారం భారతీయ జనతా పార్టీలో చేరారు. బీఆర్ఎస్ మాజీ సోషల్ మీడియా కన్వీనర్ మెంతుల రాజేందర్‌తో పాటు సంగెం మండల కేంద్రానికి చెందిన గొల్ల తరుణ్ మరియు పలువురు యువ నాయకులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

సంగెం మండల బీజేపీ అధ్యక్షులు దామెరుపుల చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా బీజేపీపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని అన్నారు. అభివృద్ధి, జాతీయవాద భావజాలం, ప్రజా సంక్షేమమే పార్టీ బలోపేతానికి కారణమని పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి యువత ముందుకు రావడం శుభపరిణామమని అన్నారు.

పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, బీజేపీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపురం బీజేపీ అధ్యక్షులు రమణాచారి, పండుగ రాజు, సంగెం మండల ప్రధాన కార్యదర్శి పవన్ సాయి, చంద్రశేఖర్, రజనీకాంత్, మైనారిటీ మోర్చా మండల అధ్యక్షులు ఎండి రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర - విజయలక్ష్మి దంపతుల 39వ వివాహ వార్షికోత్సవ వేడుకలు

» దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు
» శుభాకాంక్షల వెల్లువలో తడిసిముద్దైన పుణ్య దంపతులు





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 21**

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, విజయలక్ష్మి దంపతుల 39వ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, అభిమానులు, ప్రజాప్రతినిధుల శుభాకాంక్షల మధ్య ఈ వేడుకలు ఆనందోత్సాహాలతో కొనసాగాయి. హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని నివాసంలో కుమార్తె డాక్టర్ గంగుల గంగాభవాని, కుమారుడు- కోడలు నిఖిల్ చంద్ర, అనీలల సమక్షంలో రవిచంద్ర- విజయలక్ష్మి దంపతులు కేక్ కట్ చేసి వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రవిచంద్ర చెల్లెలు శీలం లక్ష్మీతో పాటు సన్నిహితులు మోహన్ యశ్వంత్ పాటిల్, సుమిత అరుణ్ సింగ్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు దంపతులను కలిసి శుభాకాంక్షలు అందజేశారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఎంపీ రవిచంద్ర జూబ్లీహిల్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి (టీటీడీ) ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన గోత్రనామంతో స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఆలయ వేద పండితులు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు ఒద్దిరాజు దశరథ రామయ్యను కలిసి ఆశీస్సులు పొందారు. ఒడిశా పార్లమెంట్ సభ్యులు సుభాష్ కుంతియా రవిచంద్రను శాలువాతో సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువు దశరథ రామయ్యతో పాటు ఎంపీ కుంతియాను రవిచంద్ర శాలువాలతో ఘనంగా సన్మానించారు. భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు రవిచంద్ర-విజయలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు రవిచంద్ర యువసేన సభ్యులు భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి గోత్రనామాలతో అర్చనలు చేసి దంపతుల ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కోసం ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అలాగే రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, కొన్ని ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టి రవిచంద్ర దంపతుల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. హైదరాబాద్ క్యాంప్ కార్యాలయం శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన అభిమానులు, నాయకులు, ప్రముఖులతో కోలాహలంగా మారింది. ప్రజా సేవలో ముందుండే రవిచంద్ర-విజయలక్ష్మి దంపతులు మరెన్నో సంవత్సరాలు ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని అభిమానులు ఆకాంక్షించారు.